భౌ బౌ...!



అంబేద్కర్ కూడలి వద్ద రోడ్డుపై కుక్కలు

- వీధుల్లో కుక్కల స్వైర విహారం
- అంతంతమాత్రంగా నియంత్రణ చర్యలు
- ఆందోళనలో నగరవాసులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దాదాపు ప్రతివీధిలోనూ గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. పాదచారులతో పాటు వాహనాలను వెంబడిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కుక్కకాటుకు గురై గాయాలపాలవుతున్నారు. కుక్కల నియంత్రణకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టామని చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. హర్యానాకు చెందిన స్నేహ సంస్థ కుక్కల నియంత్రణ చర్యలు చేపడుతోందని, నగరంలో 4800 కుక్కలకు గాను ఇప్పటి వరకు 3400 కుక్కలకు ఆపరేషన్లు చేసి నియంత్రణ చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి అంతకు పదిరెట్లు కుక్కలు ఉన్నాయని నగరవాసులు చెబుతున్నారు. ఏ వీధికి వెళ్లినా కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయపెడుతున్నాయి. కొన్నిచోట్ల అపార్ట్‌మెంట్ల వద్ద పిల్లలు



ఆర్.కె.నగర్ కాలనీలో రాత్రివేళ గుంపులుగా ఉన్న కుక్కలు



ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ సముదాయం వద్ద కుక్కల గుంపు

పెట్టి అక్కడి నుంచి కదలకుండా స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని నగరవాసులు కోరుతున్నారు.

నియంత్రించాలి..



రాత్రీ పగలు అని తేడా లేకుండా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. కొంచెం చీకటిపడితే చాలు ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వెళ్లేవారిని వెంటాడుతున్నాయి. నగరంలోని కుక్కలను సుదూర ప్రాంతాల్లో విడిచిపెడితే తప్ప శాశ్వత పరిష్కారం దొరకదు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

– టి.సాయిప్రసాద్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, శ్రీకాకుళం

చర్యలు చేపడతాం..



నగరంలో కుక్కల నియంత్రణకు ఇప్పటికే స్నేహ సంస్థతో ఆపరేషన్లు చేయిస్తున్నాం. ఇప్పటివరకు 3400 కుక్కలకు ఆపరేషన్లు పూర్తి చేశాం. మరో 1400 కుక్కలకు ఆపరేషన్లు చేసి నగరవాసులకు ఇబ్బంది లేకుండా చేస్తాం. పశు సంవర్ధకశాఖ ఇచ్చిన గణాంకాల మేరకే నియంత్రణ చర్యలు చేపట్టాం. – పి.వి.వి.డి ప్రసాద్, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో ఆర్డీఓ



సుధాసాగర్‌కు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఈఓ

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామిని రామచంద్రాపురం ఆర్డీవో సనపల సుధాసాగర్ శుక్రవారం దర్శించుకున్నారు. మూలవిరాట్‌కు పూజలు చేశారు. స్వామి చిత్రపటాన్ని ఆలయ ఈవో జి.గురునాథం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, కిషోర్‌బాబు తదితరులున్నారు. సుధాసాగర్ గతంలో గార తహశీల్దార్‌గా పని చేశారు.

మునగాకులో సంపూర్ణ పోషకాలు



రుప్పపేట అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు ఉత్పత్తుల ప్రదర్శన

ఎచ్చెర్ల క్యాంపస్: మునగాకును ఆహారంలో భాగంగా చేసుకోవాలని ఐసీడీఎస్ పీవో డి.పాపినాయుడు అన్నారు. ఎచ్చెర్ల మండలం ముద్దాడ పంచాయతీ రుప్పపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మునగాకు ప్రాధాన్యత, పొడి తయారీ, వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాలు కలిగిన మునగాకు ఉత్పత్తులను ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర జూడో పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రపోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం ఉమాకుమారి, పీడీలు, టీచర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–17 బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఒప్పంగి జెడ్పీహెచ్ స్కూల్ నుంచి రికార్డుస్థాయిలో ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 20, 21 తేదీల్లో శ్రీకాళహస్తి వేదికగా జరగనున్నాయి. ఎంపికైనవారిలో ఎం.సోనియా, టి.విజయలక్ష్మి, బి.ఆదిత్య, సీహెచ్ జ్ఞానేశ్వరరావు, జి.గుణశేఖర్, టి.మహేష్ ఉన్నారని హెచ్‌ఎం టి.ఉమాకుమారి తెలిపారు. క్రీడాకారులతోపాటు వీరిని తీర్చిదిద్దుతున్న పీడీలు బీహెచ్ మాధురి, పైడి సునీతలను శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో డి.కేశవరావు, బి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాంస్కృతిక పరిశోధన శిక్షణకు గోవిందరావు



సర్టిఫికెట్ అందుకుంటున్న పూజారి గోవిందరావు

ఎచ్చెర్ల: న్యూఢిల్లీలోని కేంద్ర సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ దేశంలోని అన్ని రాష్ట్రాల ఉపాధ్యాయులకు నూతన విద్యావిధానం (2020)లో సమగ్ర విద్యపై ఐదు రోజులపాటు ఈ నెల 14 నుంచి 18 వరకు శిక్షణ ఇచ్చింది. ఇందులో మన జిల్లా నుంచి లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన రాష్ట్ర సాంస్కృతిక గొప్పతనాన్ని వేదికపై వివరించి సీసీఆర్‌టీ చైర్మన్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు చిత్రపటం అందిస్తున్న ఈఓ

గార: శ్రీకూర్మనాథుని దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి చిత్తూరు జిల్లాకు చెందిన ఎం.వినోద్‌కుమార్ రూ.51 వేలు విరాళాన్ని శుక్రవారం ఈవో జి.గురునాథానికి అందజేశారు. దాతకు కూర్మనాథుని చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో నర్సుబాబు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు దుప్పట్లు

శ్రీకాకుళం కల్చరల్: మండల దీక్ష, మకరవిలక్, మకరజ్యోతి దర్శనాలకు శబరిమల యాత్ర చేసే అయ్యప్ప దీక్షాపరులకు ఇరుముడి నిమిత్తం 150 దుప్పట్లను నవంబరు 3న బొంతావారి వీధిలోని శ్రీకృష్ణార్జున మందిరం వద్ద ఉచితంగా అందజేయనున్నట్లు మిమిక్రీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికాకు చెందిన గరిమెళ్ల విజయకుమార్, బి.జి.ఆర్ ఫౌండేషన్ అధినేత బరాటం శ్రీనివాస చక్రవర్తి, తదితరుల సహకారంతో వీటిని అందజేస్తామని, 9441072762 నంబరుకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు 'వాక్ ఫర్ ఫ్రీడమ్' ర్యాలీ

శ్రీకాకుళం అర్బన్: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ, రోజస్, మూమెంట్ గ్లోబల్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7 గంటలకు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు స్టార్ వాకర్స్‌క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాశాఖ అధికారి సుధ, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కవిత, రోజస్ సంస్థ అధ్యక్షుడు జి.వి.నాగభూషణరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బి.వి.రవిశంకర్, జి.లక్ష్మి, గుడ్ల జగ్గారావు, డాక్టర్ ఎం.వాసుదేవ్, జి.వాసుదేవరావు, ఎం.మల్లిబాబు, నల్లబాటి కృష్ణమూర్తి, ఊన్న నాగభూషణరావు, పట్నాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల ఆధిపత్య పోరు



జె.ఆర్.పురంలో మద్యం దుకాణం వద్ద బైఠాయించిన మహిళలు

రణస్థలం: మద్యం షాపులను లాటరీ ప్రక్రియలో దక్కించుకున్న కొందరు కూటమి నాయకులు దుకాణాల ఏర్పాటులో ఆధిపత్య పోరు ప్రదర్శిస్తున్నారు. అత్యంత గిరాకీ ఉన్న ప్రాంతాలైన బుడుమూరు, జె.ఆర్.పురం, రావాడ, కమ్మసిగడాంలో ఎవరికి వారే బల ప్రదర్శన చేస్తున్నారు. బుడుమూరు సంత తోట సమీపంలో రెండు దుకాణాల ఏర్పాటుకు ఒకరిపై ఒకరు పరోక్ష దూషణలకు పాల్పడ్డారు. రావాడ ప్రాంతంలో గతంలో ఉండే సంతతోట స్థలాన్ని మార్చి మరో ప్రాంతానికి మార్చారు. అక్కడ కూడా కూటమి నాయకులు తమ ప్రాంతంలో మీరు మద్యం షాపు పెట్టడమేంటని మహిళలను ఉసుగొల్పి షాపు పెట్టకుండా ధర్నా చేయించారు. అందుకు ప్రతి చర్యగా జే.ఆర్.పురంలో రావాడ వారికి చెందిన దుకాణాన్ని జె.ఆర్.పురం మహిళలతో అడ్డుకుని ధర్నా చేయించారు. కమ్మసిగడాం, జే.ఆర్.పురం మరో ప్రాంతంలోనూ ఇలానే తంతు నడిచింది.


సచివాలయం పూర్తయ్యేదెన్నడో?



ఎచ్చెర్లలో గ్రామ సచివాలయ భవనం అసంపూర్తిగా మిగిపోయింది. పనులు చివరి దశలో విడిచిపెట్టడంతో పాత భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం బిల్లు బకాయి చెల్లిస్తే భవనం పూర్తయ్యే అవకాశం ఉంది.

- ఎచ్చెర్ల క్యాంపస్

శిథిలావస్థకు చేరిన షెల్టర్



ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం, కార్యాలయం వద్ద ఉన్న విశ్రాంత భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ హమాలీలు, మద్యం లోడుతో వచ్చే లారీ సిబ్బంది విశ్రాంతి తీసుకునేవారు. గతంలో మద్యం పరిశ్రమల ప్రతినిధులు సహకారంతో ఈ భవనం నిర్మించారు. కోట్లు ఆదాయం కుమ్మరిస్తున్న మద్యం గోదాం వద్ద పూర్తి సౌకర్యాలతో విశ్రాంతి భవనం నిర్మించాలని కార్మికులు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

చినుకు పడితే చిత్తడే



జాతీయ రహదారి నుంచి కేశవరావుపేట గ్రామానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. కొద్దిపాటి వర్షమొచ్చినా నీరు నిలిచిపోతుండటంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. నీరు నిల్వ లేకుండా స్థానికులు కాలువ తీసినా అందులోకి నీరు వెళ్లక పోవడం, రోడ్డు పల్లపు ప్రాంతంలో ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

- ఎచ్చెర్ల క్యాంపస్

బోరు బాగయ్యేనా?



బొంతలకూడూరు వసతి గృహం వద్ద తాగునీటి బోరు పాడైంది. గతంలో ఈ బోరు నీటిని స్నానాలకు, దుస్తులు ఉతికేందుకు, ఇతర అవసరాలకు ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకుండాపోయింది. అధికారులు స్పందించి బోరు బాగుచేయించాలని పలువురు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల

సమస్యలుంటే చెప్పండి



పోలీస్ పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

- పోలీసు సిబ్బందితో ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావచ్చని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో పోలీస్ సిబ్బంది నుంచి శుక్రవారం ఫిర్యాదులు స్వీకరించారు. ముందుగా సిబ్బంది నైపుణ్యాలు పరిశీలించారు. దేహ దారుఢ్యం, ఆరోగ్యం, సాంకేతిక నైపుణ్యాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కుటుంబ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, వ్యక్తిగత, ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్యలు ఉన్నా తనకు తెలియజేయాలని సూచించారు. ప్రతి సమస్యపైనా స్పందిస్తానని భరోసా ఇచ్చారు.

ఫోన్ ద్వారా సైతం సమస్య చెప్పవచ్చన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డు రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఇన్‌స్పెక్టర్ కె.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో దామోదర హారతులు

శ్రీకాకుళం కల్చరల్ : ఇస్కాన్ హరేరామ మందిరం ఆధ్వర్యంలో ప్రతి ఇంట్లో దామోదర హారతుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి లక్ష్మీగౌర్‌దాస్ తెలిపారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో దామోదర హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యశోద మాత, శ్రీకృష్ణ పరమాత్ముని బాల్యలీలలు వినిపించారు. కార్యక్రమంలో ఎ.వి.రమణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఇస్కాన్ ప్రతినిధి లక్ష్మీగౌర్‌దాస్

పల్లెల్లో గౌరీ పౌర్ణమి సందడి



తమ్మినాయుడుపేటలో గౌరీనోము

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో గౌరీ పౌర్ణమి ఉత్సవాలు సందడి కొనసాగుతోంది. ఫరీదుపేట, కేశవరావుపేట, ఎస్ఎంపురం, తమ్మినాయుడుపేట, బొంతలకోడూరు గ్రామాల్లో శుక్రవారం వేషధారణలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, యువత ఉత్సవాల్లో పాల్గొని సందడి చేస్తున్నారు.

ఎస్పీని కలిసిన అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ శిక్షణా కేంద్రం సీఐ ఎం.కృష్ణమూర్తి, టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.కృష్ణారావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వచ్చిన వీరు ఉదయం బాధ్యతలు స్వీకరించారు.

జిల్లాస్థాయి నాటిక పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సూత్రా ఫౌండేషన్, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో జిల్లా స్థాయి నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా మందసకు చెందిన అభినయ ప్రియ నాటక నర్తనశాల ఆధ్వర్యంలో 'అంతర్ముఖం' నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. డాక్టర్ మీగడ రామలింగస్వామి రచించగా, ఎన్.పట్టాభి రామారావు దర్శకత్వం వహించారు. అనంతరం ఆమదాలవలసకు చెందిన శ్రీవేంకటేశ్వర కళామండలి 'పులికాలం' నాటిక ప్రదర్శన జరిగింది. దీనికి రచన, దర్శకత్వం కుప్పిలి వెంకట రాజారావు అందించారు. ముందుగా జరిగిన సభలో పూర్వ సెట్‌శ్రీ సీఈవో సురంగి మోహనరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతిలు మాట్లాడుతూ కళా



మాట్లాడుతున్న డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు

సమితి సేవలను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, సూత్రా ఫౌండేషన్ అధ్యక్షుడు నిక్కు హరిసత్యనారాయణ, నూక సన్యాసిరావు, సుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, విశ్రాంత ఆర్‌డీఓ పి.ఎం.జె.బాబు, గుత్తు చిన్నారావు, మండవిల్లి రవి, ఎల్.నందికేశ్వరరావు, కిల్లాన ఫల్గుణరావు, కొమనాపల్లి సురేష్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు. నాటిక పోటీలలో భాగంగా శనివారం 'కొండగాలి' (పెద్దమేరంగి), మార్పు (కత్తివరం), కెరటాలు(రాజాం) ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



అంతర్ముఖం నాటికలో దృశ్యం

ఇసుక రీచ్‌లు ప్రారంభం



బూరవెల్లి ర్యాంపు వద్ద మైన్స్ డీడీ, అధికారులు

గార: మండలంలోని బూరవెల్లి, అంబళ్లవలస (జోగిపంతులుపేట) ఇసుక రీచ్‌లను శుక్రవారం మైన్స్ డీడీ సి.మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార నది నుంచి ఇసుకను స్టాక్ పాయింట్ వద్దకు తీసుకువచ్చి అందజేస్తామన్నారు. ఇక్కడికి ఇసుకను తెచ్చేందుకు వారం రోజులకు తాత్కాలికంగా కాంట్రాక్టు కేటాయించారు. ఇటీవల రీచ్‌ల నిర్వహణపై దాఖలైన టెండర్లును రద్దు చేసిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.రమణారావు పాల్గొన్నారు.

అందరినీ అక్షరాస్యులుగా మార్చాలి

ఎచ్చెర్ల: జిల్లాలో 39,940 మంది, లావేరు మండలంలో 1969 మంది నిరక్షరాస్యులుగా ఉన్నారని, వీరిని ఉల్లాస్ పథకం 2024–25 ద్వారా అక్షరాస్యులుగా మార్చాల్సి ఉందని లావేరు ఎంపీడీఓ పి.వెంకటరాజు అన్నారు. శుక్రవారం లావేరు మండల కేంద్రంలో వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగులో పనిచేస్తున్న వీవోలు, సీసీలు ఎస్‌హెచ్‌జీ సంఘాల ద్వారా జిల్లా కలెక్టర్ ఇచ్చిన డేటా ఆధారంగా అభ్యాసకులను, వలంటీర్ టీచర్లను గుర్తించాలని సూచించారు. ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక వలంటీర్‌ను నియమించి బ్యాచ్‌లుగా బోధించాలన్నారు. సమావేశంలో ఏపీఎం బి.వి.సుబ్బయ్యనాయుడు, సీసీలు, వీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరాజు

ప్రపంచ కళాజాతరకు జిల్లా సాహిత్య కళారత్నాలు

శ్రీకాకుళం కల్చరల్ : పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న ప్రపంచ కళాజాతరకు జిల్లాకు చెందిన పలు కళాప్రదర్శనలు, సాహిత్య ప్రదర్శనలు జరుగుతాయని ఉత్తరాంధ్ర శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ మహ్మద్ రఫీ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రంగస్థల కళాకారులు మూల తాతయ్య, స్టాలిన్, జానపద కళాకారులు కుమార్‌నాయక్‌లచే 'ఆకలి తిప్పలు', దుర్గళ నాటికల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.ఆమదాలవలస జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, గజల్ గాయకులు కె.ఎ.రాములు(గజల్స్, ఫ్లూట్, మౌత్‌ఆర్గాన్), ఈవేమన(అక్షర కిరణాల కవిత), జంధ్యాల శరత్‌బాబు, బుర్రి కుమారరాజు(కవిత) పాల్గొంటారని వివరించారు.

బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపులో మేమోగ్రామ్ కీలకం



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సురేష్

శ్రీకాకుళం న్యూకాలనీ : బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపులో 'మేమోగ్రామ్' స్క్రీనింగ్ పరీక్ష కీలకమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మేమోగ్రామ్ దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్‌లో ఉన్న కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర, జిల్లా వినియోగదారుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ బుడుమూరు శ్రీరామమూర్తి, కళింగ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు బి.వి.ఎస్.ఎన్.రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.